523038901

మృత్పిండమేకం బహు భాండ రూపం
సువర్ణమేకం బహు భూషణాని
గోక్షీరమేకం బహు ధేను జాతా
ఏకం పరాత్మా బహు దేహ వర్తి

ప్రేమ స్వరూపులారా!

మట్టి ఒక్కటైనప్పటికిని కుండలు అనేకము. సువర్ణము ఒక్కటైనప్పటికిని నగలు వివిధముగా వుంటాయి. పాలు ఒక్కటే అయినప్పటికి గోవులు అనేకముగా వుంటాయి. దేవుడు ఒక్కడే అయినప్పటికిని వివిధ రూపములతో గోచరిస్తూ వుంటాడు. ఏకం సత్ విప్రా బహుధా వదంతి. వున్నది ఒక్కటే అయినప్పటికి దానిని అనేక రూపములుగా మానవుడు దర్శిస్తున్నాడు. సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ అనగా అన్ని శిరస్సులు అన్ని నేత్రములు, అన్ని పాదములు అతనివే. ఏకో వశీ సర్వభూతాంతరాత్మా. అందరియందు వుండినటువంటి దైవత్వము ఒక్కటే. కనుక విశ్వం విరాట్ స్వరూపం. విశ్వం విష్ణుమయం. కనుక ప్రతి మానవుడు దైవస్వరూపుడే.

నీటి యందె పుట్టి నీటనే తేలుచు
నీటి యందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుండు నీరు

దివ్యత్వము ప్రతి మానవునియందు అవ్యక్తముగా వుంటున్నది. విశాలమైన సముద్రములో అసంఖ్యాకములైన అలలు బయలుదేరుతూ వుంటాయి. అనేక విధములైన రూపములు ధరిస్తూ వుంటాయి. అయితే అన్ని అలలు సముద్రమునకు వేరు కావు. సముద్రము యొక్క అంశములే అలలు. అదే విధముగా ఈ విశ్వమునందు ఆవిర్భవించే ప్రతి మానవుడు సచ్చిదానంద స్వరూపమునుండి ఆవిర్భవించిన స్వరూపములే. మమైవాంశో. అందరూ నా అంశమేగాని ఒక పంచభూత అంశముగాని లేక ప్రపంచ అంశముగాని కాదు. అని బోధిస్తూ వచ్చింది. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. కనుక మానవుడు కూడను అట్టి ప్రేమాంశమే.

కానీ అట్టి ప్రేమను మానవుడు ప్రపంచములో కొంత వరకును అందించలేక పోతున్నాడు. దీనికి కారణము స్వార్థము స్వప్రయోజనమే. ఈనాడు భౌతికముగా, వైజ్ఞానికముగా మానవ జాతి యనేక విధములుగా అభివృద్ధి గాంచినది. కాని నైతికముగా, ధార్మికముగా దిన దినమునకు దిగజారి పోతున్నది. ఏపని చేసినా స్వార్థమే వెనుక కదలుతూ వుంటుంది. ఏమి తలంచినా, ఏమి విన్నా, ఏమి పలికినా అన్నింటికి వెనుక స్వార్థమే కదలుతూ వుంటున్నది. కనుక యిట్టి స్వార్థమును మనము నిర్మూల

ము చేసినప్పుడే పరార్థము మనకు లభ్యమవుతుంది. కనుక మన సేవలయందు దివ్యత్వము ఆవిర్భవింప చేసుకొని సర్వమానవులయందు దైవత్వము వున్నదని విశ్వసించి తద్వారా మనము సేవలు చెయ్యాలి. ఈ నాటి మానవుని యందు త్యాగముపైన అభిరుచి గానీ భోగముపైన అయిష్టముగాని కావటంలేదు. మనము త్యాగేనైకే అమృతత్వమానసు అని సర్వవిధముల కొంత వరకు త్యాగము చేసి జగత్తుకు సేవలు చెయ్యాలి. మొట్టమొదట త్యాగమును తల్లితండ్రులలో ప్రారంభించాలి. తల్లి తండ్రి గురువు దైవము యీ మాటలు వరుసగా వచ్చే పదములు. ప్రతి ఒకరి నోటా మనము వింటున్నాము. ఈ వరుస క్రమమునకు వుండిన అంతరార్థమును మనము గుర్తించలేక పోతున్నాము. తండ్రి తల్లి గురువు అని చెప్పవచ్చుకదా. కానీ తల్లి తండ్రి గురువు దైవము యీనాల్గింటి యొక్క క్రమమునకు అంతరార్థము లేక పోలేదు. దీని యొక్క అంతరార్థము ఏమిటి? మనము పుట్టిన తక్షణమే మన కంటికి కనుపించేది, మనను లాలించి, పాలించి అన్నివిధములా పోషించేది తల్లి. తండ్రి ఎవరో తెలుసుకునే జ్ఞానము మనకు వుండదు. తండ్రి ఎవరో తెలుసుకునే బుద్ధి కూడను మనకు వుండదు. అట్టి అజ్ఞానస్థితిలో తల్లియే తండ్రిని చూపుతుంది. ఈ తండ్రి పెంచి పెద్దచేసి విద్యావంతుని గావించేనిమిత్తమై సద్గురువును చూపుతాడు. ఆ గురువు దైవమును చూపుతాడు. తల్లి తండ్రిని చూపుతుంది. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవమును చూపుతాడు. అదే విధముగనే భక్తి జ్ఞాన వైరాగ్య తత్వ యీనాల్గింటి ద్వారానే మనకు ముక్తి లభిస్తుందని వేదాంతము యొక్క గాథ. ముక్తి అనే దానికి యీ నాలుగు సోపానములు. భక్తి. ఈ భక్తి అనేది క్రమక్రమేణా పెరుగుతూ అదే జ్ఞానరూపము ధరిస్తుంది. ఈ జ్ఞానమే వైరాగ్యము నందిస్తుంది. ఈ వైరాగ్యమే తత్వమును తెలుపుతుంది. ఈ తత్వమువలనే మనకు ముక్తి లభిస్తుంది. దీనికే భాగవతమును పెద్ద ఆదర్శముగా తీసుకున్నారు. భాగవతమనే పదమునకు ఐదు అక్షరములు. భా-గ-వ-త-ము. భా అనగా భక్తి. గ-అనగా జ్ఞానము. వ-అనగా వైరాగ్యము. త-అనగా తత్వము. ఈ నాల్గింటి స్వరూపమే ముక్తి. కనుకనే భాగవతమనేది మనం బాగవుతాం అనే అంతరార్థము నిరూపిస్తుంది.

దైవము సర్వత్ర వుంటున్నాడు. ఎక్కడ చూచినా దైవమే వుండేది. దీనినే వేదాంతమునందు అయ్యా నీవు భగవంతుని చూడాలి చూడాలి అని ఆశిస్తున్నావు. నీవు చూస్తున్నదంతా భగవంతుడే కదా! ఈ స్వరూపాలన్నీ భగవత్ స్వరూపాలే. అయితే మానవుని యొక్క దృష్టి బహిర్ముఖముగా ప్రసరించుటంచేత అంతర్ముఖమైన ఆత్మతత్వమును అర్థము చేసుకొనలేక పోతున్నాడు. ఈ మానవుడు శాంతి నిమిత్తమై పోరాటము సలుపుతున్నాడు. తన ఆనందము తన శాంతి తనయందే వుండి కూడను కేవలము ఎండమావులను చూచి భ్రమించినట్లుగా మానవుడు బహిర్ముఖమైన ప్రయాణము సలుపుతున్నాడు. నిర్విరామ కృషిచే నిరంతర తాపత్రయములచే అంతులేని ఆశలచే మానవుడు అశాంతికి

523038903.

గుర్తై కేవలము నిరాశ నిస్పృహలతో కూలి పోతున్నాడు. మొట్టమొదట శాంతిని మనలో మనము అభివృద్ధి గావించుకోవాలి. మన శాంతిని మనయింటి లోపల ప్రసరింప చెయ్యాలి. మన యింటి నుంచి మన గ్రామములో యీ శాంతిని పంచటానికి ప్రయత్నించాలి. ఈ విధముగా వ్యక్తియందు శాంతిని మనము అభివృద్ధిగావించుకొని తదుపరి కుటుంబము నందు, తదుపరి సమాజమునందు అభివృద్ధి చెయ్యాలి. కనుక సేవ. సేవ.

శ్రవణం కీర్తనం విష్ణు స్మరణం పాదసేవనం

వందనం అర్చనం దాస్యం స్నేహ మాత్మ నివేదనమ్.

ఈ దాస్యమనేది చాలా పవిత్రమైనది. ఈ సేవా తత్వమునందు మన జీవితమును సార్థకము చేసుకోవాలి. ఆకారమానవుని వల్ల లోకమునకు ఏమాత్రము సుఖము నందించలేము. ఆచార విచార మానవునిగా మనము రూపొందాలి.

ఈ నాడు మన సంస్థల యందు సత్యము, ధర్మము, శాంతి ప్రేమ, అహింస అనే పదములను ప్రచారము చేస్తున్నాము. ప్రదర్శిస్తున్నారు. కానీ ఆచరించుటము లేదు. ప్రదర్శచేత మన యొక్క ప్రశాంతిని అభివృద్ధిగావించుకోలేము. దర్శించాలి సత్యమును. భారతీయ పవిత్రమైన శాస్త్రము దీనికి ప్రధానమైన మూలము సత్యధర్మములే. సత్యం వద ధర్మంచర అని యీ రెండింటికి ప్రాధాన్యత యిచ్చింది. కనుక మనము యీ సత్యధర్మములను సరైన మార్గమునందు నడుపుకొన లేకుండిన మానవత్వము నిరర్థకమై పోతుంది. సత్య వ్రతము తో మన యొక్క జీవితమును సార్థకము గావించుకోవాలి. ఈ సత్యమునకు రెండు రూపములు యిలయున్నవి. ఒకటి ఋతం అని రెండవది సత్యం అని. ఋతం అనేది మానసిక సత్యం. ఈ సత్యమనేది లౌకికమైన వాక్ సత్యం. ఈ మానవతా విలువలు మనము అభివృద్ధి గావించుకొన వలెనన్న అష్టాంగ యోగముల లోపల మొట్టమొదటిది యమ. యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధి యీ అష్టాంగములలో పల యమ చాలాప్రధానమైనది. యమ అనగా ఏమిటి? అహింస మొదటిది. రెండవది సత్యం మూడవది అస్తేయము. నాల్గవది బ్రహ్మచర్యము. అసంగము చెట్టచివరిది. అహింస అనగా ఏమిటి? ఒక ప్రాణిని మనము హింసించకుండా వుండటమే కాదు. శారీర మానసిక వాక్కులో కూడను ఎవరిని హింసించకూడదు. కనుక త్రికరణ శుద్ధిలో ఆచరించేదే అహింస. ఇంక సత్యము త్రికాల బాధ్యం సత్యం. ఈ సత్యము యినాటికి మరువరాదు. Truth is one not two. సత్యము అనేది చూచినది చూచినట్లుగా చెప్పింది చెప్పినట్లు చేసింది చేసినట్లు చెప్పటం మాత్రమే కాదు సత్యము. ఇలాంటి సత్యస్వరూపమైన జగత్తు నందు సత్యమును మనము ప్రచారము చెయ్యాలి. అన్నింటి యందు ప్రేమ చాలా అత్యవసరము. ఈ ప్రేమ తత్వము మనము పెంచుకుంటే సర్వము కూడను అందులో మిళితమై పోతాయి. ప్రతిసాధన యందు ప్రేమ ప్రధానమైన ప్రాణము. ఈ ప్రేమ తత్వమును మనము పెంచుకోలేక పోతే మనుష్యత్వమునకు ప్రయోజనము లేదు. ఆప్రేమనే దైవము. అందు

వలనే Love is God Live in Love. Start the day with Love. Spend the day with Love. Fill the day with Love. End the day with Love. ఈ ప్రేమతత్త్వము మనము అభివృద్ధి గావించుకోవాలి. ఈ అహంకార రహితమైన సేవలలో మనం పాల్గొనాలి. దైవత్వమును మరచటంచేత దీనత్వములో మనము మునిగిపోతున్నాము. దైవత్వమును మనము ఏనాడు విస్మరించకుండా వుంటామో అప్పుడే మన జీవితము సుఖశాంతులను పొందుతుంది.

మానవదేహమునకు ఏది కారణము? కర్మయే కారణము. ఈ కర్మకు ఏది కారణము? కేవలము భావమే కారణము. ఈ భావమునకేది కారణము? శీలము కారణము. ఈ శీలమునకేది కారణము? అదే ప్రాప్తి అదే అదృష్టము. కనుక మన అదృష్టము మంచిదిగా వుండాలంటే గుణము మంచిదిగా వుండాలి. ఈ గుణము మంచిదిగా వుండాలంటే భావము మంచిదిగా వుండాలి. భావము పరిశుద్ధముగా వుండాలంటే కర్మలు పరిశుద్ధమైనవిగా చేయాలి. కర్మ పరిశుద్ధము కావాలంటే సంకల్పము పవిత్రమైనదిగా వుండాలి. కనుక సంకల్పమే అన్నింటికిని మూలాధారము. జగత్తంతయు సంకల్పములోనే నిండివుంటున్నది. మనోమూలమిదం జగత్. సర్వము మనోమయమే. ఇది ఏమిటి? (చేతిరుమాలు చూపిస్తూ) ఒక వస్త్రము. కానీ యిది వస్త్రము కాదు. దారముల యొక్క చేరిక. దారము కాదు ప్రత్తి. ప్రత్తి లేక దారము లేదు. దారము లేక వస్త్రము కాలేదు. మూడు చేరి ఒకటైతే. అదేవిధముగ సంకల్పముల యొక్క దీనిచేత కోరికలనే దారము తయారౌతున్నది. ఈ కోరికలనే దారము చేత మైండ్ అనే వస్త్రము తయారౌతున్నది. కనుక యీ కోరికల యొక్క సమ్మిళితమైన స్వరూపమే మనస్సు. ఇప్పుడు యీ వస్త్రము మనకు వుండకూడదనుకుంటే ఒక్కొక్క దారము లాగివేస్తే వస్త్రము లేదు. అదేవిధముగా కోరికలు మనము అదుపులో పెట్టుకుంటే మనస్సు వుండదు. చాలామంది మీ మద్రాసు వారికందరికి తెలుసు. రైల్వేవారు వేస్తూ వుంటారు. Less luggage more comfort make travel a pleasure. ఈ కోరికలనేవి పెద్ద బరువైన లగేజీ. కనుక మన కోరికలు చాలా వరకు తగ్గించుకోవాలి. మితిమీరిన కోరికలలో మనము ప్రవేశించి మతిని చెడుపుకుంటున్నాము. మనకు ఎంత ప్రాప్తియో అంత తృప్తిపడాలి. తృప్తి లేని వానికి శాంతి వుండదు. శాంతి లేని వానికి సుఖము వుండదు. అందువలనే అసంతృప్తి ద్విజో నష్టః అన్నారు. అసంతృప్తి వలన రెండు నష్టములు వుంటున్నాయి. ఒకటి అశాంతి ఒకటి అసంతృప్తి. కనుక మనము తృప్తిలో వుండాలి.

దీనికోసమే మనిషి మూడు రకములైన యిచ్ఛాశక్తితో వున్నాడు. ఒకటి స్వేచ్ఛ. రెండవది పరేచ్ఛ. మూడవది అనిచ్ఛ. ఈ మూడింటి అంతరార్థము ఏమిటి? స్వేచ్ఛ అనగా మనము యిష్టము వచ్చినట్లు బజార్లు చుట్టడం, యిష్టము వచ్చినట్లు పనులు చేసుకోటం ఎవరు యేమనటానికి వీలులేదని మనము ఒక విధమైన కండబలము గుండెబలముతో వారితో పోట్లాడటం యిది మాత్రం స్వేచ్ఛ కాదు. మన స్ఫూర్తిగా సంకల్పించుకొని

ఒక కార్యము మనము సాధించినప్పుడు ఆకార్యము నుండి వచ్చిన సుఖదుఃఖములు
మనస్ఫూర్తిగా మనమే అనుభవించాలి. ఇదే స్వేచ్ఛ. మనము కార్యము చేయుటములో
ఎంత స్వేచ్ఛ వుందో ఆకార్యఫలమైన సుఖఃదుఃఖములు అనుభవించే దాంట్లో
కూడ అంతే స్వేచ్ఛను మనము అనుభవించాలి. పరేచ్ఛ అనగా యితరులయొక్క
ప్రోద్బలము చేతగాని లేక ప్రోత్సాహము చేతగాని ఒక కర్మలో మనము ప్రవేశించి
తద్వారా జరిగిన సుఖ దుఃఖములకు అయ్యో వారిని అనుసరించటము వలన నే
ను యీగతి పట్టితినని యితరులను నిందించేటువంటిది పరేచ్ఛ. మూడవది అని
చ్ఛ. తాను కోరక పరుల ప్రోద్బలమును ఏమాత్రము అనుసరించక దైవికముగా జరిగి
న సుఖ దుఃఖములను తాను అనుభవించటము యిది అనిచ్ఛ.

మానవుడు ఎవరు అని మొట్టమొదట మనము అర్థము చేసుకోవాలి.
మానవుడు అజ్ఞాని కాడు. వాడు కేవలము ఒక లోభికాదు. పాపికాదు. అతను మహాజ్ఞాని.
మానవ అనే పదమునంటే అర్థము యిమిడి వుంటున్నది. మా-అజ్ఞానము. న-లేకుండా
వ-వర్తించటము. అజ్ఞానము లేకుండావర్తించేవాడు మానవుడని. కనుక దుర్లభ
మో మానుషోదేహః. దుర్లభమైన మనుష్య జన్మ మనకు ప్రాప్తించింది. అలాంటి జన్మ
కు తగిన సార్థకము మనము సాధించాలి. రూపమునకు నామమునకు తగిన క్రియల
లో మనము పాల్గొనాలి. ఒకానొక సమయము లోపల భోజరాజు ఆస్థానములో ఒక
సన్యాసి వేషములో వచ్చి ప్రవేశించాడు ఒక వ్యక్తి. ఆనాడు ఆసన్యాసి పవిత్రమైన వేదాం
త ప్రబోధలు సలిపాడు. రాజు అతని ప్రబోధలను మెచ్చుకొని వరహాలు వున్నతట్టను
అతనికి అందించాడు. అప్పుడు ఆసన్యాసి చెప్పాడు: ఇది నేను స్వీకరించను. సర్వసంగ
పరిత్యాగియైన సన్యాసికి కాసుతో పనియేమి కనుక యిది నాకు అక్కరలేదు అన్నాడు.
రెండవ దినము అదే వ్యక్తి నర్తకి వేషము ధరించి ఆస్థానములో ప్రవేశించింది. ఆమె
నృత్యము బాగా చేసింది. సరె ఆమెకు కూడను కొంత బహుమానంగా కొన్ని వరహాలు యి
చ్చాడు. ఆమె చెప్పింది యీ కొంచెము వరహాలు తృప్తి కాలేదు యింకను కొంచెం యివ్వా
లంది. అప్పుడు సన్యాసి వేషము తో వచ్చిన వ్యక్తే నర్తకి వేషము తో వచ్చాడని గుర్తించాడు.
అయ్యా నిన్నటి దినము ఎన్ని కాసులు యిచ్చినా నాకు వద్దన్నావు యీనాడు కొంచెం కాసు
లనాసు చెందుతున్నావు దీనిలో వున్న అంతరార్థము ఏమిటి! అన్నాడు. వేషమునకు
తగిన వ్యవహారమే లేకపోతే మన సౌభాగ్యము మన భారతీయ సంస్కృతి నంత కూడను
మంటగలిపిన వారమవుతాము. కేవలము దీనిని భ్రష్టుపట్టించిన వారమవుతాము.
నా నిన్నటి దిన వేషము సన్యాసము. పేరు సన్యాసి. ఈనాటి వేషము నర్తకి. దీనికి తగిన
వేషము ధరించాను. ఆవేషమునకు తగినట్లుగా ప్రవర్తించాను నిన్నటి దినము. ఈనా
టి వేషమునకు తగినట్లుగా ప్రవర్తిస్తున్నాను నేడు అని చెప్పటంచేర భోజుడు చెప్ప
డు భేష్ యిలాంటి ప్రబోధలు నేను రాజు. రాజుకు తగినట్లుగా నేను ప్రవర్తించాలిగాని

రాజు కేవలము ఒక దుర్మార్గములో ప్రవేశించటము మంచిది కాదు. ఈ బోధ నానిమిత్తమై చేసినావని ఆమెను మెచ్చుకున్నాడు. వేషము కాషాయ వస్త్రము ధరించ వచ్చు. కానీ హృదయము అంతా కసాయమే. సంసారికి లేని ఆశలు వానికి వుంటుంటాయి. మన భారతీయ సంస్కృతి నిర్మూలమై పోతున్నది. ఇంక పండితుడనుకుంటే వేదశాస్త్ర యితిహాస పురాణములంతా చక్కగా కంఠస్తము చేసి వుండ వచ్చు. మంచి రుద్రాక్షమాల దండిగా వేయవచ్చు. ఆ వేషమునకు, ఆ పదమునకు తగిన ప్రవర్తన వానిలో వుంటుండదు. పండితః సమదర్శన సమత్వమనేది వానిలో శూన్యమైనది. వానిలో శూన్యమైనప్పుడు తాను పండితుడెట్లా అవుతాడు. త్యాగి అనే సన్యాసము లోపల వానికి ఆశలు వుంటే వాడు సన్యాసి ఎట్లా అవుతాడు. కానీ యీనాటి మానవులందరు వేదాంత ప్రబోధలు చేసే వారు అంతా భోగరాజులు. యోగరాజులుగా తయారౌతున్నారు గానీ త్యాగరాజులుగా తయారు కావటం లేదు. కనుక మనము యీనాడు సత్యసాయి సేవాదళ్ సేవకు తగిన ప్రవర్తనను మనము చెయ్యాలి. మనము సేవకులము. ఎవరికి చేసినా యిది దైవమునకు చేస్తున్నాననే భావన పెట్టుకోవాలి. వానరుడైన హనుమంతుడు ఎంతపవిత్రమైన భావములో రాముల సేవ చేశాడు. కేవలము వానరుడంటే మీరు తెలివితక్కువ వాడని మీరు భావించరాదు. శాంతుడు గుణవంతుడు బలవంతుడు హనుమంతుడు. అటువంటి హనుమంతుడు అశోకవనములో చెట్టుపైనుండగా రాక్షసులు అంతా ప్రశ్నించారు. కోతీ నీవు ఎక్కడనుండి వచ్చావు? ఎవరు నీవు అని ప్రశ్నించారు. అప్పుడు చెప్తున్నాడు హనుమంతుడు. దాసోహం కోసలేంద్రస్య. నేను రామ చంద్రుని యొక్క దాసుడను అన్నాడు. నే గొప్పవాడను బలవంతుడను హనుమంతుడను అని చెప్పలేదు గర్వించి. నేను దాసుడను, రామదాసుడను అని చెప్పుకున్నాడు. కనుక నే కింకరులు కాక శంకరులు కారు. మనము సేవకులము కాకుండా నాయకులము కాము. ఈనాటి నాయకులంతా సేవకులు కాకుండా పోవటం చేతనే వినాయకులుగా తయారౌతున్నారు. సేవలో మన జీవితమును తీర్చిదిద్దుకోవాలి. ఈ సేవలో అహంకారమునకు గాని స్వార్థమునకు గాని, స్వప్రయోజనమునకు గాని యేమాత్రము మనస్సును యివ్వకుడదు. ఎవరికి చేసినా భగవంతునికి చేస్తున్నాను అనే భావము హృదయములో పెట్టుకొని చేయాలి. అప్పుడే మానవ సేవ మాధవ సేవగా మారుతుంది. అట్లు కాకుండా నేను సేవదళము వాడిని నేను సేవ చేస్తున్నానంటే యిది ప్రదర్శనమై పోతుంది. అహంకారము నిర్మూలము కావాలి. ఈ అహంకారము కేవలము అవివేకముతో కూడి వుంటుంది. ఈ అవివేకము, అజ్ఞానము నుంచి వస్తున్నాది. ఈ అజ్ఞానమనేది వట్టి భ్రమనే. ఇలాంటి దానిలో అవివేకమును పూర్తి దూరము చెయ్యాలి. ఎవరైనా ఏమైనా అనుకోనీ నేను సేవ చెయ్యాలి యిది నా ప్రధానమైన కర్తవ్యమనే లక్ష్యమును నిలుపుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మనము సమాజములో పుట్టాము. సమాజములో పెరుగుతున్నాము. సమాజములో జీవిస్తున్నాము. సమాజములోనే మన కీర్తిగౌరవములు

52303890

పెంచుకుంటున్నాము. సమాజములోనే మన విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నాము. సమాజములోనే జ్ఞాన విజ్ఞానములో ప్రవేశిస్తున్నాము. సమాజములోనే మన జీవితమును గడుపుకుంటున్నాము. ఈ సమాజము లో మనము యిన్ని అందుకున్నప్పుడు మనము సమాజమునకు ప్రతిఫలముగా సేవ చేయనక్కరలేదా! కనుక కృతజ్ఞత రూపకముగా సేవ చెయ్యాలి. సమాజము లేకపోతే మన జీవితమే లేదు. కనుకనే యీ సమాజమునకు కృతజ్ఞత రూపకముగా మనము సేవ చెయ్యాలి. కనుక భగవంతుడిచ్చిన శరీరమును ధర్మాన్ని అనుసరించే కోసమని, ఆచరించే కోసమని యీ పవిత్రమైన జన్మము లభించింది. కనుకనే ప్రహ్లాదుడు చెప్పాడు.

చేతులారంగ శివుని బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
గలుగనేటికి దల్లుల కడుపుచేటు.

అంతేకాదు తన తోటి వారందరికి సేవ తత్త్వములో చక్కగా బోధిస్తూ నాయనా ఏది సత్యము, ఏది నిత్యము అనేదానిని మీరు విచారించాలి అన్నాడు. భగవంతుడు ఒక్కడే సత్యము. ఈ జగత్తంతా మిథ్యయే. సత్యమైన ఆత్మతత్త్వమునందే మిథ్యమైన ఆత్మతత్త్వము నిల్చి వుంటుండాది. ఇదే అక్షరం అని. ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ. అక్షర మనగా కేవలము శాశ్వతమైనదని మనము అనుకుంటున్నాము. కాదు శాశ్వతము, అశాశ్వతము రెండు చేరి వుంటున్నవి. అ. ఆత్మతత్త్వము. అ. అమృతత్వము. అ అనేది అనృతత్త్వము కాదు. అ అన్నది అమృతత్వము. కాని క్షర అనేది మృత తత్త్వము. ఇది అనిత్యమైనది. అది జీవ తత్త్వము. అక్షరక్షర మయ్యేది అమృతత్వము కూడినది కనుక అక్కడ జీవ బ్రహ్మైక్యను సంధానముగా వుంటున్నాది. జీవము క్షరమైనది. దైవము అక్షరమైనది. ఈ రెండింటి యందు వుండిన ప్రేమ తత్త్వము భక్తి ఒక్కటియే. ఈ ప్రేమ చేత అన్ని పనులు మనము ఆచరించాలి. శంకరాచార్యులు సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అన్నారు. విశేజ్ఞానమే బ్రహ్మ అని బోధించాడు ఆనందలహరిలో. కేవలము అన్నింటిని బోధించుకుంటూ భజగోవిందం భజగోవిందం గోవిందం భజమూఢమతే. అద్వైత సిద్ధాంతములో కూడను యీ యొక్క భక్తి లోపల మరల ప్రవేశించాడు. భగవంతుని భజించండి. భగవంతుని స్మరించండి సత్కర్మలు ఆచరించండి. అన్ని కర్మలు మనము భగవత్ప్రీతికరముగా ఆచరించాలి. అప్పుడే అవి కర్మలు కాకుండా సేవలుగా మారుతాయి. కనుక మనము చేసే సేవలు అన్నకూడను మన యింటిలో యే విధమైన భావములో చేసుకుంటామో బయటవారికి కూడను ఆ విధమైన భావములో చెయ్యాలి. కాని యీనాటి మానవుడు అందరు తనను గౌరవించాలని ఆశిస్తున్నాడేగాని తాను యితరులను గౌరవించటానికి ప్రయత్నించటం లేదు. ఎన్ని సిద్ధాంతములు తెలుసుకున్నా, ఎన్ని భౌతిక

523038908

భోగములు అనుభవించినా, ఎంతవైజ్ఞానిక పరిశీలన చేసినా కానీ మానవతా విలువలు ఎన్ని నీవు సంపాయించుకున్నావు అన్నదే ప్రశ్న. మానవతా విలువలు లేకపోతే యింక మానవుడెట్లా అవుతాడు చెప్పండి. ఎన్ని సంపాయించినప్పటికి మానవతా విలువలు మనలో లేకపోతే వాడు మనిషే కాదు. కనుక మానవత్వమనగా మనసు, మాట, క్రియ అన్నీ ఒక్కటిగానే అతికి యుంటె. మనసు వేరైన మాటలు వేరైన క్రియ మరొకటైన యిది యేమాత్రము విలువవుండదు. ఈ మూడింటి యొక్క ఏకత్వమే ఆనందమును అందిస్తుంది. Fan చూడండి. ఈ fan కు మూడు బ్లేడులు వున్నాయి. మూడు బ్లేడులు మూడువైపులను చూస్తుంటే మనకు గాలి వుండదు. మూడు ఒక్క రౌండుగా చుట్టినప్పుడే మనకు గాలి వస్తుంది. కనుక మన హృదయమనే దాంట్లో సత్వరజోతమో గుణములు మూడు గుణములు. ఒక ఫ్యాను. ఈ మూడింటి యొక్క ఏకత్వమును చేసినప్పుడే అదే మనకు ఆనందము.

ప్రేమస్వరూపులారా! కేవలము మీరు భజన చేయుటమనిగాని లేక ధ్యానము చేయుటమనిగాని, జపము చేయుటమనిగాని చేయవచ్చును. కాని నా వుద్దేశ్యములో కాలము వ్యర్థము చేయుటయే. ధ్యానములో కూర్చుంటారు. ఒక్క సెకండైనను మనసు నిల్పరు. ఎక్కడెక్కడికో పోతూ వుంటుంది యీ మనసంతా. ఇలాంటి మనసును నిల్పకుండా కూర్చుండటంవలన టైము ఎంత waste అవుతుంది. నీ యింటి పనులు నీవు చేసుకో. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. ఏది చేసినా దైవసేవగా మనము భావించాలి. ఆడవారికి కూడను పని లేకపోతే మాటలు ఎక్కువగా వుంటాయి. ఏ పని చేసినా మనము దైవసేవగా భావించాలి. ఒక సత్సంగము జరుగుతూ వుంటుంది. ఆ సత్సంగమునకు పోవటానికి మనకు అవకాశము వుండి వుండదు. అలాంటి సమయములో మన యింటి పనులు చేసుకుంటున్నాము. అయ్యో! యీ పనిలో నేను మునిగిపోతినే నేను సత్సంగములో చేరక పోతినే అని మనసులో బాధపడ నక్కర లేదు. నీ పిల్లలను, నీ పతిని సరైన రీతిలో చూచుకుంటే అదే నిజమైన సేవ. ఇల్లుగెల్చి రచ్చగెలవమన్నారు. మన యింటి లోపల సరైన దానిని సాధిస్తే కదా మనము బయట దేనినైనా సాధించవచ్చు. ఇల్లును నీవు వూడుస్తూ వున్నావనుకో. ఇల్లు వూడుస్తున్నాననే భావము నీవు మరచిపోయి హృదయాన్ని పరిశుద్ధము చేస్తున్నాననుకో. ఒక చపాతినో పూరినో చేస్తున్నావనుకో. అప్పుడు నా హృదయాన్ని విశాలము చేస్తున్నాను అనుకో ఎంత బాగుటుంది. కూరగాయలు తరిగి సాంబారు చేస్తున్నావనుకో. ఈ కూరగాయలు నా కామక్రోధ మదమాత్సర్యములు అనే దుర్గుణములు జ్ఞానమనే ఖడ్గముతో త్రుంచి ప్రేమ అనే జలముతో వుడికిస్తున్నాను అనుకో. ఈ విధముగా ప్రతి పనియందు భగవద్భావాన్ని ఎంతవరకు అంకితము గావించవచ్చో చెప్పండి. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం. పరనిందలు మాత్రం చేయకండి. ఎవ్వరిని మనము నిందించకూడదు. కారణమేమన అందరియందు భగవంతుడే వున్నాడు. మనదృష్టి అంతయు బాహ్యమైన దాంట్లో ప్రసరించటము చేత మనస్సు మాలిన్యమై పోతున్నాది. ఆమాలి

స్వచ్ఛమైన జలము లోపల భగవంతుని సుందర వదనారవిందము సుస్పష్టముగా కనుపించదు. అది పరిశుద్ధము గావించుకున్నప్పుడే భగవంతుని ప్రతిబింబము తప్పక కనుపిస్తుంది. చిత్తస్యశుద్ధయే కర్మణః. మనము చేసే కర్మలు మన చిత్తశుద్ధిని కలిగిస్తున్నాయి. ఈ కర్మల లో మనం ప్రవేశించకుండా పోతే మన చిత్తము మాలిన్యమై పోతుంది. కనుక మనము చేసే ప్రతి కర్మ కూడను చిత్తశుద్ధి లక్ష్యముతో చెయ్యాలి. ప్రతి ఫలమును మనము అపేక్షించకుండా వుండాలి. ఇలాంటి దాంట్లో మనము భగవద్ధ్యానాన్ని యిముడ్చుకున్నప్పుడు జీవితము సార్థకమవుతుంది.

మన మనస్సు పరిశుద్ధము కావాలంటే మూడు కార్యములు మనము చెయ్యాలి. దీనినే త్రికరణ శుద్ధి అన్నారు. అసత్యముతో దూషితము కాని వాక్కు, హింసాదులచే దూషితము కాని కర్మ, రాగద్వేషములతో దూషితము గాని మనస్సు యీ మూడింటి యొక్క పరిశుద్ధి, దీనినే త్రికరణ శుద్ధి అన్నారు. త్రికరణ శుద్ధిని గావించేదే యమం. అట్లు లేకుండా నిరంతరము ఏదో ఒక లోక సమాచారము లోపల మనము మునిగి మన మనస్సును మాలిన్యము చేసుకోటం యిది మనిషి కర్తవ్యము కాదు. ఈ నాటి మానవత్వమును చక్కగా పవిత్రము గావించే నిమిత్తమై మన జీవితము అంకితము గావించాలి. దేహము శాశ్వతము కాదు. వున్నంత లోపల మనము తగిన సత్కర్మలు ఆచరించాలి. శరీర నిర్మాణమునందే కాకుండా మేధాశక్తియందు కూడను మానవుడు అన్ని ప్రాణులకంటె ఉత్తముడుగా వుంటున్నాడు. కాని దీనికి ఆయుఃప్రమాణము చాలా తక్కువ. కనుక యీ ఆయువుండినప్పుడే మన తెలివితేటలను, మన శరీరము యొక్క శక్తిని సద్వినియోగము చేసుకోవాలి. ఆ నిమిత్తమై మానవత్వము మనకు ప్రాప్తించినదని భావించాలి. కేవలము తినటము, త్రాగటము, నిద్రించటము యింత మాత్రమే కాదు జీవితము. దీనిని సేవయందు సార్థకము చేసుకోవాలి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికి మనము నమస్కారము చెయ్యాలి. దేహములు అపవిత్రమైనవిగా వుండవచ్చును. కాని లోపలి ఆత్మ ఒక్కటే. ఆ భావముతో మనము అందరిని గౌరవించాలి.

సేవలు చేసేవారికి వినయము అత్యవసరము. మంచి మాటలచేత వారిని సంతృప్తిపరచాలి. అప్పుడే మానసికమైన విశాలత అభివృద్ధి అవుతుంది. విశాలము గావించుకోవాలి. ఎంత కాలమైనా కూడను సంకుచితము సంకుచితము యీ విధముగా చేస్తుంటే ఏనాటికి మనము పూర్ణత్వము పొందేది. పూర్ణత్వము కావాలి. సంవత్సరములు జరిగి పోతున్నాయి. కాని మనలో పూర్ణత్వము తరిగి పోతున్నది. విశాలత పెంచుకోవాలి. తాను తన కుటుంబము అనే స్థానమునుండి సమాజము అనే దాంట్లో ప్రవేశించాలి. కాని దురదృష్టవశాత్తూ యీనాటి మానవుడు అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము ఆనందమయమనే ఐదు కోశములుంటున్నవి, ఐతే అన్నమయము, దేహము, ప్రాణమయము వరకే పోతున్నాడు ప్రయాణము.

ఏదో కొంతమంది మాత్రం మనోమయము వరకు వెడుతున్నారు. విజ్ఞానమయములో ఎవ్వరూ ప్రవేశించటంలేదు. ఇంక ఆనందము మనకు ఏరీతిగా ప్రాప్తిస్తుంది. విజ్ఞానమనగా ఏమిటి? నిత్యానిత్య విషయ పరిశీలనలో మనము ప్రవేశించాలి. దేహము పాంచభౌతికము. ఇలాంటి దేహములో వుండిన దేహిని మనము కనిపెట్టాలి.

ప్రేమస్వరూపులారా.

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం
చలనము పొందు దుంప భవసాగరము దగలేని కంప అం
బుల పాటి తెమ్మ చూడ మనమెచ్చ దలంపగ దేహమింక వి
శ్వలమని నమ్మబోకు మనసా హరి పాదము లాశ్రయింపవే.

మానవత్వములో ఏల ఉత్పత్తి వృత్తులు వుండటం చేతనే మనము పవిత్రమైన కాలమును సద్వినియోగం చెయ్యాలి. సేవ చాలా అవసరమైనది. ఈనాడు సేవకులనే పేరుతో మనము ప్రవర్తిస్తున్నాము గానీ సరిగా సేవ చేయటంలేదు. ఈనాడు అధికారమునకు ముందుకు వస్తున్నారు. ఆచరణకు వెనుకకు వెడుతున్నారు. పదవులకు ముందు వస్తున్నారు. పనులకు దూరమైపోతున్నారు. తిండికి తయార్ పనికి పరార్. పనికి తయారుగా వుండాలి. తిండికి పరార్‌గా వుండాలి. పదవులు మనకు అక్కరలేదు. మనకు పని కావాలి. కనుక యీనాడు పనిలో ప్రవేశించినప్పుడు పదవి తనంతట తానే వస్తుంది. రెండు చక్కగా మనము దృష్టిలో పెట్టుకోవాలి. Rights అని మనము fight చేస్తున్నాము. what about responsibility. Right and responsibility రెండు రెండు నేత్రములు. రెండు చక్రములు, రెండు రెక్కలు. ఇందులో ఏది లేకపోయినా గాని ఎగరలేము, నడవలేము. మన బాధ్యతను సరిగా నిర్వర్తిస్తే రైట్ దానంతట అదే మనకు లభిస్తుంది. కనుక మనము కర్తవ్యమును నిర్వర్తించాలి. అదే నిజమైన యోగము. ఒకరు చూచినా చూడకపోయినా నీ మనసుకు నీకు తృప్తి కలగాలి. నీ మనస్సే నీకు సాక్షిగా నిల్వాలి. తమిళంలో చెప్తుంటారు

మనస్సుకు మనమే సాక్షి
దేహమునకు గుణము సాక్షి
సర్వమునకు స్వామి సాక్షి

కనుక మన మనస్సే మనకు సాక్షిగా వుండాలి. మన మనస్సుకు చక్కగా చేశామనే తృప్తి కలగాలి. అదే satisfaction. ఈ self satisfaction రావాలనుకుంటే self confidence వుండాలి మొదట. self confidence వలనే self satisfaction వస్తుంది. self satisfaction వలనే self sacrifice వస్తుంది. self sacrifice వలనే self realisation వస్తుంది. self satisfaction లేదు. confidence లేదు

sacrifice లేదు. realisation ఎల్లా చిక్కుతుంది మనకు. ఈ కలి ప్రభావములో కాసు ఖర్చు కాకూడదు. నడుము వంచి పని చేయకూడదు. కాలు గడప దాటకూడదు కైవల్యము పుట్టి వళ్లో పడాలి. ఇంత సోమరులు. ఇది కేవలము సోమరత్వము. సోమరత్వమును మనము దూరం చేస్తే సోహం తత్వము మనకు ప్రాప్తిస్తుంది. కనుక మనము సోమరత్వమును దూరము చెయ్యాలి. దేహము వుండినంతవరకు శ్రమించి పని చెయ్యాలి. కర్మయందే మనకు అధికారము వుంటున్నది. మన అధికారము అంతా కర్మనే. నే సార్థకత నిమిత్తము సేవలు చెయ్యాలని భావించాలి. ఇలాంటి పవిత్రమైన ప్రేమతో, పవిత్రమైన కర్మలతో జీవితాన్ని సార్థకం గావించుకుంటారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ఎన్ని సేవలు చేస్తున్నా నామస్మరణ చేత కాలమును సార్థకము చేసుకోండి. భజన చేసుకుంటూ భగవన్నామాన్ని స్మరించుకుంటూ పనులు చేస్తూ రావచ్చు శ్రమయే కనుపించదు మనకు.